ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు

5

బుధవారం 14 ఆగస్టు 2024



మైలవరం జలాశయంపై ప్రమాదకరంగా ఉన్న రహదారి

గంజాయి, మట్కా నివారణపై ప్రత్యేక దృష్టి

● ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



పులివెందుల టౌన్, ఆగస్టు 13: గంజాయి, మట్కా నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టామని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచామని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. మంగళవారం పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్‌లోని సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ, స్టేషన్ కేసుల స్థితిగతులు, నేరాలు జరిగే ప్రాంతాలు, శాంతిభద్రలు, సంఘ వ్యతిరేక కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రిళ్లు గస్తీని ముమ్మరం చేయాలని డీఎస్పీ మురళీనాయక్‌కు సూచించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మట్కా, గంజాయి, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే దొంగతనాలు జరగకుండా గస్తీ ముమ్మరం చేశామని, ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. క్రికెట్ బెట్టింగ్, పేకాట, మట్కా నిర్వహించే వారిపై గట్టి నిఘా ఉంచి.. ప్రతినెల వారికి కౌన్సెలింగ్ కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ బాల మద్దిలేటి, ఎస్ఐ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

● కడప కమిషనరుగా వైవో నందన్ బాధ్యతల స్వీకరణ



కమిషనరుగా బాధ్యతలు స్వీకరిస్తున్న వైవో నందన్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 13: కడప కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి, సంక్షేమం, పారిశుధ్యం, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కమిషనర్ వైవో నందన్ తెలిపారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన కమిషనరు (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు చేపట్టారు. అలాగే కడప అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ (కుడా) వైస్ చైర్మన్‌గా కూడా కొనసాగుతారు. ఈ సందర్భంగా ఆయనకు కార్పొరేషన్‌లోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందితో పాటు రెవెన్యూ శాఖ అధికారులు పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మేయర్, పాలకమండలి సహకారంతో కార్పొరేషన్ అభివృద్ధికి పాటుపడతామన్నారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. సిబ్బంది, అధికారులు సమయపాలన తప్పక పాటించాలని ఆదేశించారు. అనంతరం సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఎస్ఈబీ అదనపు ఎస్పీ బదిలీ

కడప (క్రైం), ఆగస్టు 13 : వైఎస్ఆర్ జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో (ఎస్ఈబీ) అదనపు ఎస్పీగా పనిచేస్తున్న జీవెంకటరాముడును ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నలుగురు అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్త ర్వులు జారీ చేశారు. ఈక్రమంలో 2012 బ్యాచ్‌కు చెందిన జి.వెంకటరాముడును ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ చేశారు. ఈయన గతంలో కర్నూలు అదనపు ఎస్పీ (అడ్మిన్)గా పనిచేస్తూ ఎన్నికల ముందు జనవరిలో జిల్లాకు ఎస్ఈబీ అదనపు ఎస్పీగా బదిలీ అయ్యారు. ఇక్కడ ఎన్నికల సమయంలో, ఎస్ఈబీ విభాగంలో సమర్థవంతంగా పనిచేసిన అధికారిగా పేరు తెచ్చుకున్నారు.

నిధుల్లేక..

● నిర్వహణ లోపం మైలవరానికి శాపం ● మరమ్మతులకు నోచుకోని జలాశయం గేట్లు
● ఐదేళ్లలో పైసా విడుదల చేయని వైసీపీ ప్రభుత్వం ● కూటమి ప్రభుత్వంలోనైనా మోక్షం కలిగేనా..



డెడ్ స్టోరేజీలో మైలవరం జలాశయం

కడప, నంద్యాల జిల్లాల్లో వేల ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి తాగునీరు అందించే మైలవరం జలాశయం నిర్వహణ లోపంతో కొట్టుమిట్టాడుతోంది. నలభై ఏళ్ల కిందట ఈ జలాశయాన్ని నిర్మించారు. ఈ జలాశయానికి ఉన్న 13 గేట్లకు మరమ్మతు పనులు గత ఐదేళ్లలో చేసిన దాఖలాలు లేవు. జలాశయంపై నిర్మించిన 2.85 కి.మీ రహదారి పాడైంది. రక్షణ గోడలు సైతం చాలా వరకు దెబ్బతినడంతో పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైలవరం జలాశయం ఆనకట్టపై ఉన్న స్తంభాలకు విద్యుత్ దీపాలు అలంకారప్రాయంగా మారాయి.

మైలవరం, ఆగస్టు 13: మైలవరం జలాశయం పూర్తి నీటిసామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం డెడ్‌స్టోరేజీలో ఉంది. ఇందులో 0.585 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. మైలవరం జలాశయం నుంచి కడప జిల్లాలోని జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైలవరం, పెద్దముడియం, రాజుపాళెం, కమలాపురం, ఎర్రగుంట్ల మండలాలతో పాటు నంద్యాల జిల్లాలోని చాగలమర్రి, సంజామల, ఉయ్యాలవాడ మండలాల పరిధిలో 75 వేల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించాల్సి ఉంది. అలాగే.. జలాశయం చుట్టుపక్కల గ్రామాలకు తాగు, సాగు నీరు అందిస్తారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న జలాశయం నిర్వహణ లోపంతో కునారిల్లుతోంది. దీనికి కారణం నిధులు లేకపోవడమే అని అధికారులు అంటున్నారు.

మరమ్మత్తు పనులు శూన్యం

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో మైలవరం జలాశయ నిర్వహణకు, ఎలాంటి మరమ్మత్తు పనులకు నోచు కోలేదు. నిర్వహణ లోపం మైలవరం జలాశయానికి శాపంగా మారింది. డ్యాం కరకట్ట అక్కడక్కడ కుంగిపోతోంది. వంతెనపై రహదారి అధ్వాన్నంగా ఉంది. గేట్ల పై భాగంలో రక్షణ గోడలు కూలి అధ్వాన్నంగా దర్శనమిస్తున్నాయి. వీటన్నింటినీ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిధులు విడుదల కాకపోవడంతో వారు చేసేదేమి లేక చేతులెత్తేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా నిధులు వచ్చి మైలవరం జలాశయం వద్ద మరమ్మతులు చేపట్టి అటు పర్యాటకులకు ఇటు రైతులకు ఇబ్బంది లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..

మైలవరం జలాశయ ఆధునీకీకరణ, ప్రహరి, రక్షణ గోడలు, విద్యుత్, రోడ్డు, గేట్ల మరమ్మతులు తదితర పనులకు రూ.90 కోట్ల మేర నిధులు అవసరమని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాము. నిధులు మంజూరైన వెంటనే పనులు మొదలు పెడతాం.
- గౌతమ్‌రెడ్డి, జలాశయ ఏఈఈ



జలాశయం వంతెనపై కూలిన ప్రహరీ గోడ

సాగునీటి ప్రాజెక్టులపై.. అలర్ట్

తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోవడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. సాగునీటి ప్రాజెక్టుల గేట్లు ఎలా ఉన్నాయో పరిశీలించి యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించింది. దీంతో తెలుగుగంగ ఎస్ఈ వెంకట్రామయ్య బృందం మంగళవారం జిల్లాలో పలు సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించింది.

● గేట్ల పటిష్టతపై తనిఖీలు
● నిర్వహణ కోసం రూ.3.25 కోట్లు కేటాయింపు
● రూ.20లక్షలతో తెలుగుగంగ ప్రాజెక్టు గేట్ల మరమ్మత్తులు



(కడప-ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా వర్షాకాలం ముందు సాగునీటి ప్రాజెక్టులను తనిఖీలు చేస్తారు. గేట్ల పటిష్టత, కట్ట బలహీనత, తూములు తదితర వాటిని పరిశీలించి వర్షాకాలం నాటికి సాగునీటి ప్రాజెక్టులు సిద్ధం చేసేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణను గాలికి వదిలేసింది. చిన్నచిన్న మరమ్మత్తులకు కూడా నిధులు కేటాయించలేదు. జూన్ 12న కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఇక జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.3.20 కోట్లను కేటాయించింది. గేట్ల మరమ్మత్తులు, తూముల మరమ్మ త్తులు, నీటి ప్రవాహానికి అడ్డులేకుండా ఉండేందుకు కెనాల్‌లో పేరుకుపోయిన కంపచెట్ల తొలగింపు ఇతరత్రా వాటికి నిధులు విడుదల చేసింది. ఇక రూ.75 లక్షలతో తెలుగుగంగ జలాశయంలో గేట్ల మరమ్మత్తులు, ముళ్ల కంప తొలగింపు కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

జిల్లాలో తెలుగుగంగ ప్రాజెక్టుతో పాటు ఎస్ఆర్-1 ఎస్ఆర్-2, తెలుగుగంగ, ఎల్ఎస్‌పీడ్యాం, కమలకూరు ఆనకట్టను వెంకట్రామయ్య బృందం పరిశీలించింది. గేట్ల పటిష్టతపై అంచనా వేశారు. ఇక గండికోట, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పైడిపాలెం రిజర్వాయర్లలో గేట్లను ఇతర వాటిని పరిశీలిస్తున్నారు. కృష్ణాజలాలు ఇప్పటికే జిల్లాలోకి వచ్చేశాయి. ఎస్ఆర్-1 నుంచి ఎస్ఆర్-2 ప్రాజెక్టులను నింపుతున్నారు. చెన్న ముక్కపల్లె కెనాల్ నుంచి చింతకుంట, శెట్టివారిపల్లె, ఎర్రచెరువు, లింగాలదిన్నె చెరువులకు నీటిని విడుదల చేశారు.

గత అనుభవాల దృష్ట్యా..

సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి పెట్టకపోతే నీటి ఉధృతికి గేట్లు కొట్టుకుపోయినా.. కాల్వలకు గండి పడినా భారీ ప్రాణనష్టంతో పాటు ఆస్తి నష్టం జరుగుతుంది. రెండేళ్ల క్రితం అన్నమయ్య డ్యాం ప్రాజెక్టు కొట్టుకుపోయి ప్రాణ, ఆస్తినష్టం మిగిల్చింది. తెల్లారేలోపే ఎన్నో కుటుంబాల బతుకులు తెల్లారిపోయాయి. ఇసుక మాఫియా కారణంగానే ప్రాజెక్టు దెబ్బతినిందంటున్నారు. ఇసక తవ్వకాల వల్ల ప్రాజెక్టు దెబ్బతింటుందని చెప్పినా పట్టించుకోకపోవడం, వైసీపీ నేతల తప్పిదాల కారణంగా అక్కడ జనానికి శాపంగా మారింది. ఇక నాలుగేళ్ల క్రితం లోయర్ సగిలేరు ప్రాజెక్టు (ఎల్ఎస్‌పీ) డ్యాం గేట్లు కూడా నీటి ఉధృతికి కొట్టుకుపోయాయి. ఎల్ఎస్‌పీలో నీరు ఉండడంతో ఆ ప్రాంత రైతులు సంతోషించారు. ఈ సారి కరువు తీరిందని పంటలు బాగా పండుతాయని కలలు కన్నారు. అయితే గేట్లు కొట్టుకుపోయాయి. నిర్వహణ లోపం, వర్షాకాలంలోపు ప్రాజెక్టులపై ముందస్తు సన్నద్ధత లేక పోవడంతో గేట్లు కొట్టుకుపోయాయి.

గత ప్రభుత్వ వైఫల్యాలను దృష్టిలో పెట్టుకుని.. కూటమి ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు మంజూరు చేసింది. కాల్వల్లో పూడిక, తూముల్లో నీళ్ల పోయేందుకు అడ్డంకులు తీసివేయడం, ఇతర మరమ్మత్తులకు నిధులు కేటాయించింది. తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోవడంతో అధికారులు స్పందించి పరిశీలిస్తున్నారు.



తెలుగుగంగ ప్రాజెక్టు గేట్లను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకట్రామయ్య, తదితరులు

15న ఖైదీల విడుదల లేనట్లే..

కడప (క్రైం), ఆగస్టు 13 : కడప సెంట్రల్ జైలులో జీవితఖైదు అనుభవిస్తున్న కొంత మంది ఖైదీలకు ఆగస్టు 15న విడుదల నిలిపివేశారు. కడప కేంద్ర కార్యాలయంలో సత్ప్రవర్తన కలిగిన 20 మంది పేర్లను విడుదల కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అయితే వారిని ఆగస్టు 15న కాకుండా గాంధీ జయంతి రోజు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రాజెక్టుల నిర్వహణలో వైసీపీ నిర్లక్ష్యం : తులసిరెడ్డి

వేంపల్లె, ఆగస్టు 13: గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా విస్మరించిందని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నేత నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ప్రధానమైన రాష్ట్రం, వ్యవసాయానికి సాగునీటి ప్రాజెక్టులు గుండెకాయ లాంటివన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు విడుదల చేయకుండా.. నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ఫలితంగా పులిచింతల, గుండ్లకమ్మ ప్రాజెక్టుల గేట్లతో పాటు ఉమ్మడి జిల్లాలోని అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులే కొట్టుకుపోయాయన్నారు. ఈనెల 10న తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోయి.. రిజర్వాయర్‌లోని నీళ్ల సముద్రం పాలయ్యాయన్నారు. మూడేళ్లుగా ఎస్ఈ పోస్టు ఖాళీగా ఉందన్నారు. కేసీ కెనాల్, హెచ్ఎల్‌సీ కింద కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలో 6.61 లక్షల ఎకరాలకు సాగునీరు, వేలాది గ్రామాలకు తాగునీరు అందేదన్నారు. చంద్రబాబు ప్రాజెక్టుల పట్ల ప్రత్యేక శ్రద్ధపెట్టాలని సూచించారు.

పులివెందులలో అక్రమ లేఅవుట్ల దందా

● నిబంధనలు పాటించకుండా ప్లాట్ల అమ్మకాలు ● రాజకీయ అండతో చెలరేగుతున్న మాఫియా
● రిజిస్ట్రేషన్ శాఖకు పట్టని నిబంధనలు ● మున్సిపల్, గ్రామ పంచాయతీల ఆదాయానికి గండి

పులివెందుల రూరల్, ఆగస్టు 13: పులివెందులలో అక్రమ లేఅవుట్ల దందా నడుస్తోంది. కనీస అనుమతులు పొందకుండా, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా లేఅవుట్లు వేసి ప్లాట్ల అమ్మకాలు సాగిస్తున్నారు. పులివెందుల మున్సిపాలిటీతో పాటు గ్రామ పంచాయతీల్లో కూడా ఇదే తరహా అనధికార లేఅవుట్లు వెలిశాయి. కొందరు రాజకీయ నేతలు తమ అధికారాన్ని ఉపయోగించుకొని అక్రమ లేఅవుట్లు వేశారు. పలు చోట్ల సాగుకు అనువైన భూమిని కొనుగోలు చేసి లేఅవుట్లు ఏర్పాటు చేశారు. ల్యాండ్ కన్వర్షన్ లేకుండా.. పభుత్వ నిబంధనలు పాటించకుండా లేఅవుట్లు పదుల సంఖ్యలో వెలిశాయి. రియల్ వ్యాపారులు మాత్రం ఏదైనా సమస్య ఉంటే.. రిజిస్ట్రేషన్ శాఖలో రిజిస్ట్రేషన్లు ఎలా అవుతాయంటూ కొనుగోలుదారులకు బ్రెయిన్ వాష్ చేసి ప్లాట్ల అమ్మకాలు సాగిస్తూ జేబులు నింపుకుంటున్నారు. అయితే ప్లాట్ల కొనుగోలు చేసిన వారికి మాత్రం భవిష్యత్‌లో తిప్పలు తప్పవని చెబుతున్నారు.

లేఅవుట్‌కు అనుమతి పొందాలంటే..

మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో లేఅవుట్‌కు అనుమతి పొందాలంటే నిబంధనలు తప్పక పాటించాలి. ల్యాండ్ కన్వర్షన్ తప్పనిసరి. లేఅవుట్‌లో ప్రజాప్రయోజనార్థం (పార్కు, ఆలయం తదితరవి) పది శాతం స్థలం, వీధి లైట్లు, కాల్వల కోసం సుమారు రెండు శాతం స్థలం, 40 అడుగుల ప్రధాన రహదారి, 30 లేదా 20 అడుగుల వీధి రహదారి ఉండాలి. వీటితో పాటు ఇళ్ల నిర్మాణంలో మున్సిపాలిటీకి, గ్రామ పంచాయతీకి విస్తీర్ణాన్ని బట్టి స్థలం కేటాయింపు జరగాలి. లేఅవుట్‌ను విస్తీర్ణాన్ని లెక్కలోకి తీసుకొని తగిన రుసుము మున్సిపాలిటీకి, గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సి ఉంటుంది.

నిబంధనలు పట్టించుకోని మాఫియా

పులివెందుల పరిధిలో ఇలాంటి నిబంధనలు పట్టించుకోని రియల్ ఎస్టేట్ మాఫియా ఇష్టానుసారం లేఅవుట్లు వేసి జేబులు నింపుకుంటున్నారు. మున్సిపాలిటీలో అయితే టౌన్‌ప్లానింగ్ విభాగం పరిధిలోకి రాగా, గ్రామ పంచాయతీల్లో కార్యదర్శి చూసుకుంటారు. కొన్ని చోట్ల ప్రభుత్వ భూమిని కలిపేసుకుంటూ లేఅవుట్లు వేసినట్లు సమాచారం. అంతేకాకుండా ప్రైవేట్ ప్లానర్ల ద్వారా లేఅవుట్ తయారు చేయించుకొని.. ఆ మ్యాప్‌ను ప్రజలకు చూపుతూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ అనధికార లేఅవుట్ల కారణంగా మున్సిపల్, గ్రామ పంచాయతీలకు భారీగా గండిపడుతోందని ఆయాశాఖల అధికారులు చెబుతున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రశ్నిస్తే అన్నీ మేము చూసుకుంటాం అని చెబుతున్నారని అధికారులు తెలిపారు.

నోటీసులు అందించాం..

పులివెందుల పరిధిలో 12 అనధికార లేఅవుట్లను గుర్తించాం. ఇప్పటికే వీటికి సంబంధించి నోటీసులు అందించాం. ఒక వేళ నోటీసులకు స్పందించకుంటే చట్టపరంగా ముందుకెళ్తాం.
- రమణారెడ్డి, కమిషనర్, మున్సిపాలిటీ పులివెందుల

కళ్లు మూసుకున్న రిజిస్ట్రేషన్ శాఖ

ఫలానా లేఅవుట్‌లో ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు వస్తే... అందుకు సంబంధించిన అనుమతులు ఉన్నాయా లేవా అని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. అయితే పులివెందుల రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు అనుమతులు పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు సమాచారం. మున్సిపల్, గ్రామ పంచాయతీల అనుమతులు, ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఇందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు భారీగా ముడుపులు అందజేస్తున్నారనే ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి.



పులివెందుల మున్సిపాలిటీలో అక్రమ లేఅవుట్లు



పులివెందుల మండలం ఆర్.తుమ్మలపల్లె వద్దనున్న లేఅవుట్



కడప ఏడు రోడ్ల కూడలిలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

త్యాగమూర్తుల పుణ్యఫలం.. స్వాతంత్ర్యం

● కడపలో హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీ

కడప (మారుతీనగర్)/ఎడ్యుకేషన్, ఆగస్టు 13: ఎందరో త్యాగమూర్తులు తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారని, వారి పుణ్యఫలాలను యావత్ భారత జాతి స్మరించుకోవాల్సిన అవసరం ఉందని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, జమ్మలమ డుగు, కమలాపురం ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, జిల్లా అధ్య క్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని బీజేవైఎం, అఖిలపక్ష కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఏడు రోడ్ల సర్కిల్ వరకు మువ్వన్నెల జెండాతో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల్లో జాతీయతా భావాలను పెంపొందింపచేయాలనే సంకల్పంతో ప్రతి ఇంటిపై మూడురంగుల జెండా ఎగురవేయాలని ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు అవగాహన ర్యాలీ చేపట్టామన్నారు. ప్రతి ఇంటిలో.. ప్రతి గుండెలో దేశ భక్తి, జాతీయభావం నింపుకునేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం దేశ వ్యాప్తంగా చేపట్టడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భూపేష్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, జనసేన పార్టీ నాయకులు సుంకర శ్రీనివాస్ పాల్గొన్నారు.



కడపలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న జేసీ అదితిసింగ్, ఎమ్మెల్యే అదినారాయణరెడ్డి, శింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు

వైవీయూలో 350 అడుగుల పతాకం..

దేశ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా వైవీయులో మెగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాథరెడ్డితో కలిసి ప్రారంభించారు. స్పోర్ట్స్ సైన్స్ శాఖ సహాచార్యులు డాక్టర్ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 350 అడుగుల పొడవైనా మువ్వన్నెల జెండాను విద్యార్థులు చేతబూని.. భారత మాతకు జై, వందేమాతరం, జై జవాన్ జై కిసాన్ అనే నినాదాలతో హోరెత్తించారు. ర్యాలీ ప్రధానపరిపాలన భవనం నుంచి ప్రారంభమై విశ్వవిద్యాలయంలోని రహదారుల ద్వారా కడప, పులివెందుల రోడ్ల మీదుగా మళ్లీ పరిపాలన భవనానికి చేరుకుంది. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ దేశ పౌరుడుగా గర్విద్దాం, దేశం కీర్తించేలా ఎదిగి దేశ ఔన్నత్యాన్ని శిఖర స్థాయికి తీసుకువెళదామన్నారు. ఉప ప్రధాన ఆచార్యులు ప్రొఫెసరు పద్మ, సీనియర్ ప్రొఫెసర్లు సహాయ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



350 అడుగుల మువ్వన్నెల జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న వైవీయూ అధికారులు, విద్యార్థులు

చెరువులకు ఏటా రెండు సార్లు నీరందిస్తాం: ఎమ్మెల్యే


ఎర్రచెరువు తూమును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు రూరల్ ఆగస్టు 13: చెరువులకు ఏటా రెండు సార్లు నీరందించి, రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. దువ్వూరు మండలంలో మంగళవారం ఎస్ఆర్ 1 నుంచి మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లె వరకు తెలుగుగంగ అధికారులను వెంటపెట్టుకుని ఎమ్మెల్యే కాల్వ కట్టమీద 18 కిలోమీటర్లు ప్రయాణించారు. ఈ సుమారు ప్రయాణం చేశారు. ప్రయాణంలో లైనింగ్ లేని కాల్వను పరిశీలించారు. తూములకు వెంటనే గేట్లు బిగించాలని అధికారులను ఆదేశించారు. చాలా చోట్ల లైనింగ్ లేక పోవడంతో నీరు వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులకు నీరు వెళుతున్న తూములకు వెంటనే గేట్లు బిగించాలని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు ఉన్న టీడీపీ ప్రభుత్వంలో 0-18 కిలో మీటర్ వరకు లైనింగ్ పనులు జరగడంతోనే నేడు మనకు నీరు పుష్కలంగా వస్తున్నాయన్నారు. నియోజకవర్గంలోని చెరువులకు నీటిని నింపిన తరువాతే బ్రహ్మంసాగర్‌కు నీటిని పంపిస్తామన్నారు. డిసెంబర్‌లో మళ్లీ చెరువులకు నీటిని నింపడంతో సాగు, తాగునీటి సమస్య కూడా లేకుండా పోతుందన్నారు. అనంతరం శెట్టివారిపల్లె శివశంకర్‌రెడ్డి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విందులో ఆయన పాల్గొన్నాడు. కార్యక్రమంలో ఎస్ఐలు మద్దిలేటి, వినోద్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, దువ్వూరు మండల అధ్యక్షుడు బోరెడ్డి వెంకటరమణారెడ్డి, ఐ టీడీపీ రాష్ట్ర నేతలు కొండపల్లి ఉమాకాంత్, కటారిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవి ఫిట్‌నెస్ లేని వ్యాన్లు..!

పరిమితికి మించి విద్యార్థుల సంఖ్య ● ప్రమాదాలకు కారణమవుతున్న వైనం ● నామమాత్రంగా అధికారుల తనిఖీ

రైల్వేకోడూరు, ఆగస్టు 13: ఫీజుల కింద వేలకు వేల రూపాయలు గుంజుతూ ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ పాఠశాలల యాజమాన్యం విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. స్కూళ్ల వ్యాన్లకు ఫిట్‌నెస్ లేకపోవడంతో అవి అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. డ్రైవర్లు వాహనాలను నిర్లక్ష్యంగా నడపడంతో విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. స్కూలు వాహనాల్లో విద్యార్థులను అధిక సంఖ్యలో వేసుకుని వెళుతున్నారు. పట్టణం కంటే గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. ప్రైవేటు స్కూళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. స్కూళ్ల యాజమాన్యాల వారు రాజకీయ పలుకుబడి కలిగి ఉండడంతో ఎన్ని ప్రమాదాలు, వివాదాలు జరిగినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. స్కూల్ వ్యాన్ డ్రైవర్ కారణంగా ఓబులవారిపల్లెలో రెండో తరగతి చదువుతున్న భవిష్యరెడ్డి బలైంది. స్కూళ్ల వ్యాన్లకు ఏడాదికి ఒకసారి అధికారులు పరీక్షించి ఫిట్‌నెస్‌ను ధృవీకరించాల్సి ఉంది. కొందరు డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా, అతివేగంతో వాహనాలు నడుపుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉదయాన్నే క్యారీ కట్టించి స్కూలుకు విద్యార్థులను పంపిన తల్లిదండ్రులకు పిల్లలు సాయంత్రం ఇంటికి చేరే వరకు నమ్మకం లేని విధంగా స్కూళ్ల వ్యాన్ల పరిస్థితి తయారైంది. పిల్లలను వ్యాను ఎక్కించిన తర్వాత డోర్లు వేసుకోకుండా వెళుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే వ్యాన్లు అతివేగంగా వెళుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి స్కూళ్ల వ్యాన్ల డ్రైవర్లు, యజమానులకు ఆర్టీఏ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చేవారు. విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారే తప్ప విద్యార్థులకు సరైన భద్రత కల్పించడంలో



ఓబులవారిపల్లె మండలంలో బోల్తాపడిన స్కూల్ వ్యాన్ (ఫైల్‌ఫొటో) - స్కూల్ వ్యాన్ల డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ బాబు

మెరంగా విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నెలలో ఒక చిన్న ప్రమాదమైనా జరుగుతోందని విద్యార్థులు వాపోతున్నారు. కొందరు డ్రైవర్లు మద్యం మత్తులో వాహనాలను నడుపుతున్నారని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పుల్లంపేట మండలంలో 4 స్కూళ్లు, పెనగలూరు మండలంలో 10, కోడూరు మండలంలో 26, ఓబులవారిపల్లె మండలంలో 12, చిట్వేలి మండలంలో 4 ప్రైవేటు స్కూళ్లకు వ్యాన్లు ఉన్నాయి. అధికారులు నామమాత్రంగా డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారని, వాహనాల ఫిట్‌నెస్‌పై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటే ప్రమాదాలు జరగవని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్కూళ్ల వ్యాన్లకు ఫిట్‌నెస్‌లు ఉన్నాయి

ప్రైవేటు స్కూళ్ల వ్యాన్లకు ఫిట్‌నెస్‌లు ఉన్నాయని రాజంపేట బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. లైసెన్సులు ఉన్న వారే వాహనాలను నడపాలని, మద్యం మత్తులో వాహనాలను నడపరాదని సూచించారు. ఏడాదికి ఒక్కసారి వాహనాలను సక్రమంగా పరిశీలించి ఫిట్‌నెస్ ఇస్తామన్నారు. ఓబులవారిపల్లె మండలంలో జరిగిన స్కూల్ వ్యాన్ ప్రమాదంపై ఆరా తీశామని తెలిపారు. విద్యాశాఖ అధికారులు ఏడాదికి ఒకసారి స్కూల్ వ్యాన్ల స్థితిగతులను పరిశీలిస్తామని రైల్వేకోడూరు ఎంఈఓ పోతురాజు రామయ్య తెలిపారు. లైసెన్సులు తదితర వాటిని పరిశీలిస్తామని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా స్కూల్ డ్రైవర్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు సీఐ టి.బాబు తెలిపారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

● ప్రజాదర్బార్‌కు విశేష స్పందన : మంత్రి మండిపల్లి


మహిళల సమస్యలు వింటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 13: భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంత్రి పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరై తమ సమస్యలు మంత్రికి తెలిపారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన భూఆక్రమణలు, భూకబ్జాలపై ఎక్కువ సమస్యలు వస్తున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 15వ తేదీ నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి శాశ్వత భూసమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. దాదాపు 45 రోజులు జరిగే రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహించేందుకు రెవెన్యూ అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారని తెలిపారు. ప్రజలంతా రెవెన్యూ సదస్సులకు హాజరై తమ సమస్యలు అధికారులకు తెలిపి పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను అన్ని శాఖల అధికారులు సీరియస్‌గా తీసుకుని ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఇక నుంచి శాశ్వత భూసమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. ప్రజాదర్బార్ ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

గిరిజనులకు ఉచితంగా డీఎస్సీ కోచింగ్

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఆగస్టు 13: బీఎడ్, డీఎడ్, టెట్ ఉత్తీర్ణులైన గిరిజన నిరుద్యోగులకు తిరుపతిలో ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.సరస్వతి పేర్కొన్నారు. అభ్యర్థుల వయసు విద్యాశాఖ నిబంధనల మేరకు ఉండాలని సూచించారు. మెరిట్ ఆధారంగా లేదంటే ఏదైనా స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఉంటుందని వివరించారు. అర్హులైన గిరిజన యువత బయోడేటా, విద్యార్హత పత్రాలు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, రెండు కలర్ పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు బీఎడ్, డీఎడ్, టెట్ మార్కుల జాబితా కాపీలను గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ, కలెక్టరేట్ డి-బ్లాక్, కడప చిరునామాకు పంపాలన్నారు. 19వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు చేర్చాలని జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

ఏపీడీతో టీడీపీ నేతల వాగ్వాదం


ఏపీడీ నాగరత్నమ్మతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చాపాడు, ఆగస్టు 13: మండల కేంద్రంలో మంగళవారం జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి సామాజిక తనిఖీ సదస్సులో డ్వామా అదనపు పీడీ నాగరత్నమ్మతో మండల టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. 2023-24లో మండలంలో జరిగిన రూ.7.50 కోట్ల అభివృద్ధి పనులపై ఈ సదస్సులో చర్చించారు. నాగరత్నమ్మ పంచాయతీలవారీ జరిగిన అభివృద్ధిపై చేసిన విచారణను డీఆర్‌పీలు చదివి వినిపించారు. మండలంలో మొత్తం 22 గ్రామ పంచాయతీల్లో రూ.22,664 అవకతవకలు జరిగినట్లు డీఆర్‌పీలు వివరించారు. ఈ డబ్బు రికవరీ చేయాలని ఏపీఓ జగదీష్‌ను ఏపీడీ ఆదేశించారు. పల్లవోలు, చాపాడు, అల్లాడుపల్లె, చియ్యపాడు, అన్నవరం, ఖాదర్‌పల్లె గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు పనితీరుపై టీడీపీ నేతలు, కార్యకర్తలు ఏపీడీకి వినతి పత్రాలు ఇచ్చారు. వారి ఫిర్యాదులపై విచారణకు ఆదేశిస్తానని తెలిపారు. సిద్ధారెడ్డిపల్లె, తప్పెట ఓబాయపల్లె, ఖాదర్‌పల్లె, లక్ష్మిపేట, పల్లవోలు, చిన్నగురవలూరుల్లో కొంతమేర డబ్బు తేడా కనిపించినట్లు ఏపీడీ చెప్పారు. ఇంతకుముందు ఏపీఓగా పనిచేసిన పద్మారాణి ఖాదర్‌పల్లెలో జరిగిన పనులకు సంబంధించిన 135 మస్టర్లలో సంతకాలు ఎందుకు చేయలేదని నాగరత్నమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుడు ఏం చేశావని, ఎందుకు సంతకాలు చేయలేదని నిలదీశారు. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు పద్మారాణికి రూ.5 వేలు జరిమానా విధించినట్లు ఏపీడీ చెప్పారు. చియ్యపాడులో ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామ సభలకు సంబంధించి దండోరా ఎందుకు వేయలేదని ఆమె అసహనం వ్యక్తం చేశారు. మొత్తానికి ఉపాధి సిబ్బందికి భయం లేదన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ లక్షుమయ్య, ఎంపీడీవో శ్రీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ


గండి అంజన్నను దర్శించుకున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

చక్రాయపేట, ఆగస్టు 13: గండి క్షేత్రంలో జరిగే శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా చేసిన ఏర్పాట్లను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. తొలుత ఆయన గండి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆదేశాల మేరకు ప్రధాన అర్చకుడు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్ పూజలు జరిపించి హారతులు అందుకున్నారు. అనంతరం శాలువ పూలమాల వేసి సత్కరించారు. శ్రావణ మాసం ఏర్పాట్లు, భక్తుల రాకపోకల గురించి అడిగి తెలుసుకున్నారు. రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి ఆంజనేయస్వామి మహిమలను చరిత్ర, మకరతోరణం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చక్రాయపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐలు రంగనాథ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

మినీ బస్సు బోల్తా - ఒకరి మృతి

10 మందికి గాయాలు ● సత్యసాయి జిల్లాలో ఘటన ● మృతుడు సింహాద్రిపురం వాసి



హరి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు - (ఇన్‌సెట్‌లో) హరి(ఫైల్‌ఫొటో) క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

తాడిమర్రి/సింహాద్రిపురం, ఆగస్టు 13: సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలంలోని దాడితోట అదానీ హైడల్ పవర్ ప్రాజెక్టు వద్ద మినీ బస్సు బోల్తా పడింది. దీంతో కడప జిల్లా వాసి బోనాల హరి(37) మృతి చెందగా మరో పది మంది గాయపడినట్లు ఎస్ఐ నాగాస్వామి తెలిపారు. మృతుడి భార్య ఉమా మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు... కడప జిల్లా సింహాద్రిపురం మండలం కసనూరు వాసులు బోనాల హరి, భార్య ఉమామహేశ్వరి, కుమారుడు తనీష్ ద్విచక్రవాహనంలో వెలిదండ్లకు వచ్చి అనంతపురం వెళ్తున్న మినీ బస్సు ఎక్కారు. అక్కడి నుంచి బస్సులోని వారితో కలిసి అనంతపురంలోని ఎస్ఎన్ హెర్బల్ న్యూట్రిషన్ వారు నిర్వహిస్తున్న సమావేశానికి బయల్దేరారు. దాడితోట వద్ద బస్సు అదుపు తప్పి బోల్తా పడడంతో బోనాల హరి అక్కడికక్కడే మృతి చెందగా ఉమామహేశ్వరి, బాలచంద్రారెడ్డి, గోపాల్, శైలజ, దినేష్, హారిక, పెద్దవీరయ్య, హుసూరీబీ, బాబా, రెడ్డమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారిని పులివెందుల వైద్య కళాశాలకు 108లో తరలించారు. డ్రైవర్ షేక్ మాబుషరీఫ్ మాత్రం ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డాడు. ఘటనా స్థలంలో మృతుడు బోనాల హరి కుమారుడు రోధించిన తీరు పలువురిని కలిచివేసింది. తీవ్రంగా గాయపడి మృత్యువుతో పోరాడాతున్న తండ్రిని చూసి 'భయపడకు డాడీ, నీకు ఏమీకాదు' అంటూ రోధించడం చూసిన వారందరూ కన్నీటిపర్వంతమయ్యారు. ఎస్ఐ నాగాస్వామి కేసు నమోదు చేసుకుని బాధితులను విచారించేందుకు పులివెందులకు వెళ్లి పూర్తి వివరాలను సేకరించినట్లు తెలిపారు. కాగా మృతుడు హరి సింహాద్రిపురంలో ఫొటో స్టూడియో నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోవడంతో కుటుంబ సభ్యులు శోక సముద్రంలో మునిగిపోయారు. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి సోదరుడు టీడీపీ నేత జయభరత్ రెడ్డి హరి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి, బీటెక్ రవి ద్వారా ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పలువురు ఫొటోగ్రాఫర్లు హరి మృతదేహానికి నివాళులు అర్పించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

16 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

రూ.2.25లక్షల నగదు స్వాధీనం


ముద్దనూరు ఆగస్టు13: యామవరం గ్రామ సమీప కంపచెట్లలో పేకాడుతున్న 16 మందిని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు వివరాలు... యామవరం వద్ద కొందరు పేకాడుతున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేసి 16 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నాము. వారి వద్ద నుంచి రూ.2.25లక్షలు నగదు, 13 మొబైల్స్, రెండు కార్లు, 2రెండు బైకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేంపల్లెలో చోరీ

స్కూటీ నుంచి రూ.30వేలు అపహరణ

వేంపల్లె, ఆగస్టు 13: వేంపల్లెలో స్కూటీలో ఉంచిన రూ.30వేలు నగదును గుర్తుతెలియని వ్యక్తి అపహరించారు. సోమవారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో స్కూటీలో ఉంచి కోదూరు రామచంద్రారెడ్డి పాలు, పెరుగు కోసం దుకాణంలోకి వెళ్లాడు. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి రూ.30వేలు నగదు దొంగిలించాడు. బ్యాంకులో లోను చెల్లించి మిగిలిన డబ్బును స్కూటీలో ఉంచి నిలిపి ఉండగా ఈ చోరీ జరిగిందని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

3 టీఎంసీలు దాటిన గండికోట నీటిమట్టం


గండికోట ప్రాజెక్టు వద్ద నీటిమట్టం

కొండాపురం, ఆగస్టు 13: గండికోటలో నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. 11 న అవుకు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయగా ఇప్పటి వరకు 1.5 టీఎంసీలకు పైగా నీరు వచ్చి చేరింది. జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 11,600 క్యూసెక్కులు ఉన్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. మంగళవారం సాయింత్రానికి ప్రాజెక్టులో మూడు టీఎంసీల నీటిమట్టం దాటినట్లు డీఈ తెలిపారు.

జిల్లాలో 24మంది సీఐల బదిలీ

కడప (క్రైం), ఆగస్టు 13: వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 24 మంది సీఐలను బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంతకల్లు రైల్వేలో పనిచేస్తున్న నాగార్జునను కడప టూ టౌన్, కడప టూటౌన్‌లో పనిచేస్తున్న ఇబ్రహీంను కర్నూలు సీసీఎస్, కళ్యాణ దుర్గం రూరల్‌లో పనిచేస్తున్న వెంకటనాగరాజును కడప తాలూకా, కడప తాలూకాలో పనిచేస్తున్న రాజాను కడప వీఆర్ ఎస్పీ, ఒంటిమిట్టలో పనిచేస్తున్న పురుషోత్తంరాజును చెన్నూరు, చెన్నూరులో పనిచేస్తున్న పార్థసారథిని కడప వీఆర్ ఎస్పీ, కలకడలో పని చేస్తున్న శ్రీనివాసులును పోరుమామిళ్ల, పులివెందుల రూరల్‌లో పని చేస్తున్న బాలమద్దిలేటిని ప్రొద్దుటూరు రూరల్, ప్రొద్దుటూరు రూరల్‌లో పనిచేస్తున్న రమణారెడ్డిని కడప వీఆర్ ఎస్పీ, కడప రెడ్ శ్యాండల్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న నారాయణయాదవ్‌ను జమ్మలమడుగు, జమ్మలమడుగులో పనిచేస్తున్న కడప వీఆర్ఎస్పీ, అనంతపురం వీఆర్‌లో పనిచేస్తున్న వెంకటరమణను పులివెందులకు, చిత్తూరు వీఆర్ ఎస్పీలో పనిచేస్తున్న లింగప్పను పులివెందుల రూరల్‌కు, కడప ఇంటలిజెన్సీలో పనిచేస్తున్న నాగరాజును అర్కేవ్యాలీ, కడప డీసీఆర్‌బీలో పని చేస్తున్న సయ్యద్ హసంను మైదుకూరు అర్బన్, మైదుకూరు అర్బన్‌లో పనిచేస్తున్న మస్తాన్‌ను కడప వీఆర్ ఎస్పీ, అన్నమయ్య వీఆర్ ఎస్పీలో పనిచేస్తున్న మోహన్‌ను ఖాజీపేట, కడప వీఆర్ ఎస్పీలో పనిచేస్తున్న రామచంద్రను మదనపల్లె టూటౌన్, కడప వీఆర్ ఎస్పీలో పనిచేస్తున్న యల్లమరాజును రైల్వేకోడూరు, కడప వీఆర్ ఎస్పీలో పనిచేస్తున్న శ్రీనాథరెడ్డిని కర్నూలు డీఎస్పీ-2, కర్నూలు మహిళా పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న హాజీవల్లిని పులివెందుల ట్రాఫిక్, కర్నూలు వీఆర్ఆర్‌ఓలో పనిచేస్తున్న భాస్కర్‌రెడ్డిని కడప డీసీఆర్బీ, కడప డీసీఆర్బీలో పనిచేస్తున్న రాజాప్రభాకర్‌ను కడప వీఆర్ఎస్పీ, ఏపీ జన్‌కోలో పనిచేస్తున్న జావేద్‌ను కడప ట్రాఫిక్‌కు బదిలీ చేశారు.


తైక్వాండోలో సత్తా చాటిన వి. తైక్వాండో క్లబ్ క్రీడాకారులు

తైక్వాండోలో సత్తా చాటిన జిల్లా వాసులు

కడప (స్పోర్ట్స్) ఆగస్టు 13: తిరుపతిలో ఈనెల 11, 12, తేదీల్లో జరిగిన మొదటి సౌత్‌జోన్ జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లావాసులు సత్తా చాటారు. సుమయ్య, చంద్రకళ, సుహాన్విక రెడ్డి, ఎన్. చరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్. ప్రణయ్‌కుమార్‌రెడ్డి, టి. హర్షవర్ధన్‌రెడ్డి, ఇర్ఫాన్, గోల్డ్‌మెడల్ సాధించగా భవ్య, జాహ్నవి, సాయి, ఎం. సాయిచాణక్యరెడ్డి, ఈకౌశిక్ నారాయణ, సోఫైల్, సాజిద్, సిల్వర్‌మెడల్స్ సాధించినట్లు వి తైక్వాండో మాస్టర్ ఎస్‌కె వసీం, కోచ్ కె.నరసింహ వెల్లడించారు.

సర్టిఫికెట్ల పరిశీలన

కడప(రూరల్) ఆగస్టు 13: జడ్పీ సీఈఓ ఎం. సుధాకర్‌రెడ్డి అనుమతి మేరకు జడ్పీ కార్యాలయంలో కారుణ్య నియామక ఉద్యోగాల దరఖాస్తు దారుల సర్టిఫికెట్లను కమిటీ బృందం పరిశీలించారు. మొత్తం 9 మంది హాజరు కావాల్సి ఉండగా 7 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ మన్నూరు సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, పరిపాలనా అధికారి రంగాచార్యులు, సీనియర్ స్టెనో తదితరులున్నారు.

చైను అపహరణ

రైల్వేకోడూరు, ఆగస్టు 13: రెడ్డివారిపల్లె పంచాయితీ పరిధి కేసీ అగ్రహారం వాసి కంచర్ల రాజమ్మ బంగారు చైను గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం అపహరించాడు. బాధితురాలి వివరాల మేరకు... ఆస్పత్రి కోసం తిరుపతికి వెళ్లిన రాజమ్మ తిరిగి రైల్వేకోడూరు నుంచి స్వగ్రామనికి ఆటోలో రెడ్డివారిపల్లె వరకు వెళ్లింది. అక్కడి నుంచి కేసీ అగ్రహారా నికి నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి మోటారు సైకిల్‌లో వేగంగా వచ్చి మెడలో ఉన్న బంగారు చైను అపహరించాడు. బంగారు చైను 40 గ్రాములు ఉంటుందని దీని విలువ రూ. 2.4 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. పోలీసులకు ఫిర్యాదు చేశామని వివరించారు.

పుష్పగిరి గుట్టపై లక్ష మొక్కలు నాటేందుకు ప్రణాళిక

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 13: పవిత్ర పుణ్యక్షేత్రం పుష్పగిరి గుట్టపై లక్ష మొక్కలు నాటే దిశగా అధికారులు ప్రణాళిక రూ పొందించారు. కలెక్టర్ శివశంకర్ ఆదేశాల మేరకు సామాజిక అటవీశాఖ డీఎఫ్ఓ ఎం.నాగార్జున రెడ్డి, ఫారెస్టు రేంజ్ ఆఫీసరు నాగేశ్వర్‌రెడ్డి, అటవీశాఖ రిటైర్డ్ డిప్యూటీ కన్జర్వేటర్ శ్రీనివాస్ ఇన్‌టాక్ జిల్లా కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, సభ్యుడు భారవి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య గుట్టపై మొక్కలు నాటేందుకు అనువైన స్థలం పరిశీలించారు. మొక్కలు నాటడం, నీటి లభ్యత అంశాలపై చర్చించారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ఇన్‌టాక్, లయన్స్ క్లబ్ కలవడం అభినందనీయమన్నారు.

'కమీషన్ అడిగితే డీటీ బెదిరిస్తున్నాడు'

జమ్మలమడుగు, ఆగస్టు 13: కమీషన్ అడిగితే తనను డీటీ వరదకిశోర్‌రెడ్డి బెదిరిస్తున్నాడని తహసీల్దారు కార్యాలయంలో దొరసానివీధి 4వ రేషన్ షాప్ డీలర్ ఓ.హబీబూన్ భర్త తానేషావలి తహసీల్దారు శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. తహసీల్దారుకు సమస్యను తెలిపాడు. తన భార్య ఓ.హబీబూన్‌పేరుపై డీలర్ షాపు ఉండేదన్నారు. కొన్నేళ్లగా రేషన్ షాపు సమస్య రాకుండా పంపిణీ చేశానని తెలిపాడు. గత నెలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వరదకిశోర్‌రెడ్డి తనకు ఫోన్ చేసి డీలర్‌షిప్ రాజీనామా చేయాలని కోరారన్నారు. అడిగిన వెంటనే తాను డీలర్‌షాప్‌కు రాజీనామా చేసి తనకు రావాల్సిన కమీషన్ డబ్బు రూ.21,300 అడుగగా కొత్త డీలర్ నుంచి ఇప్పిస్తానని, మా ఇంట్లో బియ్యం కాటా మిషన్, ఈపాస్ మిషన్‌లు ఇచ్చారన్నారు. డీలర్ రాజీనామా పత్రాన్ని ఇంతవరకు ఆమోదించకుండా మళ్లీ తన భార్యను సంతకం చేయమని డీటీ అడిగారన్నారు. కమీషన్ అడిగితే నోరు పారేసుకుని ఇష్టానుసారంగా దుర్భాషలాడారని వాపోయాడు.

పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

వల్లూరు, ఆగస్టు 13: పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి అన్నారు. మంగళవారం వల్లూరు మండలంలోని ఎంపీడీఓ సభాభవనంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లు కీలకపాత్ర పోషించాలన్నారు. టీడీపీ ప్రభుత్వం పంచాయతీలకు నిధులు కేటాయిస్తోందన్నారు. గ్రామ వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి గ్రామం లో సిమెంటు రోడ్లు వేయడం, ప్రతి ఇంటికీ తాగునీటికి కుళాయిలు ఏర్పాటు చేయడం తమ లక్ష్యమన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామాభివృద్ధి దేశానికి పట్టుగొమ్మలాంటిదన్నారు. అలాగే విద్యార్థులు, యువత గంజాయి వైపు అడుగులువేస్తున్నారని, గంజాయి నిర్మూలనకు నడుం బిగించాలన్నారు. గంజాయి మహమ్మారికి అడ్డుకట్ట వేయాలన్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినత్సో వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఆట ల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందించాలన్నారు. పంచాయతీల్లో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.సమావేశంలో ఎంపీడీఓ జయశ్రీ, తహసీల్దారు శ్రీవాణి, పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు.

విధుల పట్ల అంకితభావం అవసరం

● సర్పంచ్‌ల శిక్షణలో ఎంపీడీఓ


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ

చెన్నూరు, ఆగస్టు 13 :పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు తమ విధుల పట్ల అంకిభావంతో పనిచేయాలని ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ అన్నారు. మంగళవారం చెన్నూరు గ్రామ పంచాయతీ పార్కు ఆవరణంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు సచివాలయాల సిబ్బందితో రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీకి నిధులు అనేవి ఆ పంచాయతీ జనాభానుబట్టి తప్పక వస్తాయని అయితే ఆ నిధులు సక్రమంగా సద్వినియోగం కావాలంటే మొదట తాము నిర్వహించే విధుల పట్ల బాధ్యతగా ఉండాలని ఆ యన్నారు. ప్రతి పంచాయతీకి పక్కాప్రణాళిక అవసరమని ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీటిపై దృష్టి పెడితే సగం సమస్యలు లేకుండా పోతాయని అన్నారు. అందువల్ల ప్రతి ఉద్యోగి, ప్రతి పంచాయతీ సర్పంచ్ ఇది మన పంచాయతీ, మన ఊరు, దీన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్న భావనతో పనిచేయాలని అలాంటప్పుడే అభివృద్ధి జరుగుతుందన్నారు. అలాగే పారిశుధ్య కార్మికులు సైతం వారి విధులను ప్రతిరోజూ అంకితభావంతో నిర్వహించినప్పుడే గ్రా మాల్లోని ప్రతి వీధి ఆరోగ్యంతో విలసిల్లుతుందన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు పలువురు పంచాయతీ అభివృద్ధిలో తమ వంతు పాత్ర గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డీ సురేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఇతర పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ముళ్లకంపల తొలగింపు


కడప కాల్వ వెంబడి ముళ్లపొదలను తొలగిస్తున్న దృశ్యం

వల్లూరు, ఆగస్టు 13: కడప కాల్వ వెంబడి ఉన్న ముళ్లకంపలను ఎమ్మెల్యే క్రిష్ణచైత్యరెడ్డి చొరవతో తొలగించారు. మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లె డ్యాం నుంచి కడప కాల్వకు నీళ్లు వదిలేందుకు వచ్చిన ఎమ్మెల్యే దృష్టికి స్థానిక రైతులు కడప కాల్వ వెంబడి ఉన్న ముళ్లపొదలను తొలగించాలని తెలపడంతో ఆయన ఇరిగేషన్ డీఈ బ్రహ్మం రెడ్డికి ఆదేశించారు. దీంతో మంగళవారం ఆదినిమ్మాయపల్లె నుంచి అలంఖాన్‌పల్లె వరకు కడప కాల్వ వెంబడి ఉన్న ముళ్లపొదలను తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు.

సింహాద్రిపురం ఎస్ఐగా తులసీనాగప్రసాద్


బాధ్యతలు చేపట్టిన తులసీనాగప్రసాద్

సింహాద్రిపురం, ఆగస్టు 13: సింహాద్రిపురం మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా మంగళ వారం తులసీనాగప్రసాద్ బాధ్యతలు చేపట్టారు.గతంలో రాజుపాళెం పీసీలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రొద్దుతిరుగుడు మినీ కిట్లు పంపిణీ


రైతులకు మినీ కిట్లను అందిస్తున్న ఏఓ ఓబులేసు


పెండ్లిమర్రి, ఆగస్టు 13: మండలంలోని ఇసుకపల్లెలో మంగళ వారం ప్రొద్దుతిరుగుడు మినీ కిట్లు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి జి.పి.ఓబులేసు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలానికి ఆరు క్వింటాళ్ల ప్రొద్దుతిరుగుడు విత్తనాలు మంజూరయ్యాయని, కావాల్సిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో పేరు నమోదు చేసుకొని విత్తనాలు తీసుకెళ్లాలని తెలిపారు. సాగులో ఉన్న పంటలకు ఇ-క్రాప్ చేయించుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

'భజనపరులతో జాగ్రత్తగా ఉండాలి'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 13 : టీడీపీలో భజనపరులతో జాగ్రత్తగా ఉండాలని, లేదంటే పార్టీ మనుగడకే ముప్పువాటిల్లుతుందని టీడీపీ నగర ఉపాధ్యక్షుడు కొండా సుబ్బయ్య, శివశంకరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి ఆ పార్టీ నాయకుల భజన చేసేవారి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. టీడీపీ కడప నియోజకవర్గంలో కూడా చాలామంది వైసీపీ నుంచి వచ్చి టీడీపీ అంటే మేమే, మాదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. పార్టీ కష్టకాలంలో జెండా పట్టుకున్న కార్యకర్తలను అణగదొక్కే ప్రయత్నం జరుగుతోందని, అటువంటి వారితో నాయకులు జాగ్రత్తగా ఉండాలని, లేదంటే పార్టీ మనుగడకే ప్రమాదమన్నారు.

వాన కురిసేనా.. వరి పండేనా..?

● తీవ్ర వర్షాభావం... అన్నదాతల్లో ఆందోళన


ఎడారిలా కనిపిస్తున్న వేంపల్లె పాపాఘ్ని నది... పాపాఘ్ని నదీ పరివాహక ప్రాంతంలో సాగు చేసిన వరి

వేంపల్లె, ఆగస్టు 13: ఎడారిలా కనిపిస్తు ఈ చిత్రం వేంపల్లె పాపాఘ్ని నది. తీవ్ర వర్షాభావంతో చుక్కనీరు లేదు. ఈ సీజన్‌లో 80మి.మీ. వర్షపాతం ఇప్పటికే కురావాల్సి ఉండగా కేవలం 25 మి.మీ. మాత్రమే కురిసింది. భూగర్భజలాలు అడుగంటుతుండటంతో రైతుల్లో ముఖ్యంగా వరి రైతుల్లో ఆందోళన నెలకొంది. మండలంలోని పాపాఘ్ని నదీ పరీవాహక ప్రాంతంలో ఇక్కడ నెలక్రితం నుంచి వరి సాగు చేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల పొలాలు పచ్చదనం పరచినట్లు ఉన్నాయి. వేంపల్లె, ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లె, అలిరెడ్డిపల్లె, తువ్వపల్లె గ్రామాల్లో ఈ వరిసాగు చేశారు. వెయ్యి ఎకరాలు సాగు కావాల్సి ఉండగా ఇప్పటికి 650 ఎకరాలు మాత్రమే సాగు చేశారు. కోటి ఆశలతో వరి పంటను సాగైతే చేశారు గానీ తీవ్ర వర్షాభావం ఉండడంతో పోనుపోను భూగర్భజలాలు అడుగంటితే ఎట్లా అని రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

రాహుకాల దీప కాంతుల్లో విజయదుర్గాదేవి ఆలయం


ప్రత్యేక అలంకారంలో విజయదుర్గాదేవి... రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు

కడప (కల్చరల్), ఆగస్టు 13: రాహుకాల దీప కాంతుల్లో మంగళవారం విజయదుర్గాదేవి ఆలయం కాంతులీనింది. శ్రావణమాసం కావడంతో అమ్మవారి సన్నిధిలో రాహుకాల దీపాలు వెలిగించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 వరకు రాహుకేతు పూజలు చేశారు. కాగా శ్రావణమాసం సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 16న వరలక్ష్మీవ్రతం, 19న శ్రావణపౌర్ణమి విశేష పూజలుంటాయని ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్ తెలిపారు.

ఎన్ఎంయూ తీర్థం పుచ్చుకున్న వైఎస్సార్ ఈయూ సభ్యులు


ఎన్ఎంయూ తీర్థం పుచ్చుకున్న వైఎస్సార్ ఈయూ నాయకులు

కడప (మారుతీనగర్), ఆగస్టు 13: ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరు సాగిస్తున్న ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్‌లోకి సుమారు 30 మంది వైఎస్సార్ యూనియన్‌కు చెందిన సభ్యులు చేరారు. మంగళవారం స్థానిక కడప డిపోలో ఎన్ఎంయూ నాయకులు సర్వసభ్యసమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎన్ఎంయూ కడప డిపో అధ్యక్షుడు టి.జయరామ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి. శివారెడ్డి, రీజనల్ కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర అధ్యక్షుడు పి.వి. రమణారెడ్డి హాజరయ్యారు. పీఎస్ ఖాన్ ఆధ్వర్యంలో ఎన్ఎంయూ సభ్యత్వం తీసుకున్న వారిని సాదరంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో కడప డిపో ఎన్ఎంయూ నాయకులు శ్రీనివాసులు, సుబ్బారావు, వరదారెడ్డి, పలువురు పాల్గొన్నారు

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి: జడ్జి


వంటగదిని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్

పెండ్లిమర్రి, ఆగస్టు 13: క్రమశిక్షణతో విద్యనభ్యసించి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని కడప జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం పెండ్లిమర్రిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. భవనాన్ని, తరగతి గదులను, లైబ్రరీని, మరుగుదొడ్లను, పరిశుభ్రతను పరిశీలించారు. మధ్యాహ్న భోజన వివరాలు, స్నాక్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, భారత రాజ్యాంగం, జౌరవ జాతీయ న్యాయ సేవాధికారి సం స్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవ లు పథకం 2015 అంశాలను వివరించారు. సమస్యలను జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ దృష్టికి తీసుకురావచ్చన్నా రు.

ఆటో చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

కడప (క్రైం), ఆగస్టు 13: కడప నగరం రిమ్స్ వద్ద పార్కింగ్ చేసిన ఆటోను చోరీ చేసిన కేసులో ఓ దొంగ అరెస్టు అయినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా రామాపురం మండలం దూదేకులపల్లెకు చెందిన బాలగిరి మహ్మద్‌రఫి 11న రిమ్స్ వద్ద ఆటోను చోరీ చేసి తీసుకెళ్లాడు. మంగళవారం సెంట్రల్ జైలు వద్ద నిందితుడిని అరెస్టు చేసి ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

● ఆర్‌జేడీ ఏడీకి విద్యార్థి యువజన సంఘాల వినతి


ఆర్‌జేడీ కార్యాలయం ఏడీకి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి యువజన సంఘం నాయకులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 13 :జిల్లాలో నిబంధనలు పాటించని కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనరు కత్తి ఓబులేసు, సీఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాజ్, అర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌జేడీ కార్యాలయంలో ఏడీ అరుణకుమార్‌ను కలిసి వారు వినతపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధిక ఫీజులతో విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి పాఠశాలలపై విచారణ జరిపి తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘం నాయకులు ప్రవీణ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయండి


రెవెన్యూ సదస్సుపై వివరిస్తున్న తహసీల్దారు నాగేశ్వరరావు

సీకేదిన్నె, ఆగస్టు 13: రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని తహసీల్దారు రాజేశ్వర్‌రావు తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలోని తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం బీఆర్‌వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుండి నిర్వహించే రెవెన్యూ సదస్సులను అధికారులు పకడ్బందీగా నిర్వహించి ప్రజల సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించాలని ఎటువంటి సమస్య ఉన్నా ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం పొందాలన్నారు. ఆయా గ్రామాల్లో రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని వారి సమస్యలు చెప్పుకునే విధంగా ఏర్పాటు చేయాలన్నారు.

పత్తిపంటను పరిశీలించిన ఏఓ

వీరపునాయునిపల్లె, ఆగస్టు 13: మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు మం గళవారం పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సూక్ష్మధాతు లోపాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. మంగళవారం కొమ్మద్ది, వెల్లుర్తి గ్రామాలలో సాగులో ఉన్న పత్తి పంటను ఆయన పరిశీలించారు. పత్తిలో ప్రధానంగా మెగ్నీషియం, బోరాన్ లోపాలు గమనించామని, నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. లక్షణాలు తెలియజేసి సలహాలు, సూచనలు ఇచ్చారు. గులాబీ రంగు పురుగు ఆశించకుండా పక్షి స్థావరాలను, లింగాకర్షక బుట్టలను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు.

వైవీయూ బీటెక్ ఆరో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల


ఫలితాలను వివరిస్తున్న వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 13 :వైవీయూ ప్రొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ ఆరో సెమిస్టరు పరీక్ష ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసరు ఎన్.ఈశ్వర్‌రెడ్డి, ఇంజనీరిగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసరు జయరామిరెడ్డితో కలిసి విడుదల చేశారు. వైవీయూ తన చాంబరులో వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్‌లో 86 శాతం, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ వంద శాతం, ట్రిబుల్‌ఈలో 88 శాతం, ఈసీఈలో వంద శాతం, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 75 శాతం ఫలితాలు వచ్చాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల డీన్ ప్రొఫెసరు రమణయ్య పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో నేటి నుంచి మహా సంప్రోక్షణ వార్షికోత్సవం

పులివెందుల టౌన్, ఆగస్టు 13: పట్టణంలోని శ్రీచక్రసహిత శ్రీమహాలక్ష్మీ దేవస్థాన నిర్మాణం అమ్మవారి ప్రతిష్ట అయి 12 సంవత్సరాల సందర్భంగా బుధవారం నుంచి మహా సంప్రోక్షణ పంచలోహ శ్రీచక్రప్రతిష్ట మహోత్సవాలు వైభవంఆ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం, గురువారం, శుక్రవారాల్లో గణపతిపూజ స్వస్తి వాచన కలశస్థాపన అంకురార్పణ అగ్నిప్రతిష్ట మహాగణపతి హోమాలు తదితర పూజాది కార్యక్రమాలు ఉంటాయన్నారు. అన్నదానం ఉంటుందన్నారు.

నగరంలో మువ్వన్నెల జెండా రెపరెపలు


కడప నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కడప (మారుతీనగర్) ఆగస్టు 13. నగరంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో మనదేశ పతాకం మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. భారీ జెం డాను విద్యార్థులు ఊరేగించారు. ఇం దులో భారీ సంఖ్య లో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, కార్యదర్శి చాగలమర్రి ఓబులేసు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణయాదవ్, జిల్లా అధికారప్రతినిధి వి.వి.చలపతి, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, కడప పార్లమెంట్ నాయకులు బొమ్మన సుబ్బరాయుడు, నాయకలు మునగా సతీష్‌కుమార్, హరినారాయణరావు, హరికృష్ణ, బీజేవైఎం నా యకులు సురేంద్ర, శ్రీకాంత్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపేటలో...

మండలంలోని నాగులగుట్టపల్లెలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు ఈ ర్యాలీ చేపట్టామన్నా రు. ప్రతి ఇంటిపై జాతీ య జండా ఎగురవేయాల ని ప్రజలకు తెలియజేశా రు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, గాలి హరిప్రసాద్, సు మన్, రశరథ, టీడీపీ నాయకులు సుబ్బరామయ్య, రామకృష్ణ, యల్లయ్య, పరమేశ్వర, జనసేన నాయకులు సాయికుమార్, చెంచయ్య, బద్రి, కుమార్, పవన్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు సంజీవ్‌కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా డ్రైనేజీ కాల్వ పూడిక తీత పనులు

కమలాపురం రూరల్, ఆగస్టు 13 :నియోజకవర్గ ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి చొరవతో కమలాపురం నగర పంచాయతీలో కాల్వ పూడికతీత పనులు చేపట్టినట్లు ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం నగర పంచాయతీలోని రఖా కాల్వ పూడిక తీత పనులు గండ్లూరుకాలనీ నుంచి పుట్లంపల్లె వరకు పూర్తయ్యాయన్నారు. బీడీ కాలనీలోని యల్లమ్మ తల్లి గుడి వద్ద డ్రైనేజీ కాల్వలోని చెత్తను పూర్తిగా తొలగించామన్నారు. అలాగే కమలాపురం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఎప్పటికప్పుడు నీటిని తొలగించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో నగర పంచాయతీ అన్ని విధాలా వెనుకబడిందన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే డ్రైనేజీ కాల్వల పనులు చేపట్టే విధంగా టీడీపీ నాయకులకు సలహాలు ఇచ్చారని, ఆయన సూచనల మేరకే ఈ పనులు ప్రారంభిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కమలాపురం అన్నివిధాలుగా అభివృద్ధిపథంలో నడిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం మండల అధ్యక్షుడు శిరిగిరెడ్డి రాఘవరెడ్డి, మాజీ ఎంపీటీసీ చదిపిరాళ్ల వాసుదేవరెడ్డి, తలపనూరు గంగిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

స్త్రీలలో స్వీయ అవగాహన పెరిగితేనే సమాజాభివృద్ధి

● జేవీవీ జాతీయ ఉపాధ్యక్షుడు విశ్వనాథ్


మాట్లాడుతున్న జేవీవీ జాతీయు ఉపాధ్యక్షుడు విశ్వనాథ్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 13 : స్త్రీలలో స్వీయ అవగాహన పెరిగితేనే సమాజాభివృద్ధి సాధ్యమని జేవీవీ జాతీయ ఉపాధ్యక్షుడు జేవీవీ జాతీయ ఉపాధ్యక్షుడు విశ్వనాథ్ అన్నారు. స్త్రీలపై అఘాయిత్యాలు పెరగడానికి తల్లిదండ్రులు తమ పిల్లలను సరైన పద్ధతితో పెంచకపోవడం కూడా ఒక కారణమన్నారు. సోమవారం అలంఖాన్‌పల్లె మెప్మా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొదుపు సంఘాల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు ఎలా ఉండాలి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అఘాయత్యాలు జరిగే సమయంలో ఎలా వ్యవహరించాలి, అప్రమత్తంగా ఎ లా ఉండాలి, మగపిల్లలు ఆడపిల్లల పట్ల ఎలా మెలగాలి అన్న అంశాలను చిన్నతనంలోనే నేర్పిస్తే మంచిద న్నారు. అనంతరం జేవీవీ నాయకుడు శంకరయ్య మాట్లాడారు. జేవీవీ నాయకులు ప్రసాద్, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

40 శాతం వాటాను స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలి

● మంత్రి లోకేష్‌కు వినతి


మంత్రిని కలిసిన జూనియర్ లెక్చరర్ ప్రమోషన్ పోరాట వేదిక ప్రతినిధులు

వేంపల్లె, ఆగస్టు 13: జేఎల్ పోస్టుల్లో 50 శాతం నియామక ప్రక్రియ ద్వారా, పదిశాతం పోస్టులు వివిధ శాఖల్లోని బోధనేతర సిబ్బంది ద్వారా భర్తీ చేస్తున్నా మిగిలిన 40 శాతం వాటాను స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలని జూనియర్ లెక్చరర్ ప్రమోషన్ పోరాట వేదిక ప్రతినిధులు కోరారు. మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మంగళగిరిలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర లీగల్ అడ్వైజర్ పురుషోత్తమాచారి మాట్లాడుతూ జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు తమ వాటాగా ఉన్న 40 శాతంజూనియర్ లెక్చరర్ పోస్టులను ప్రమోషన్లతో భర్తీచేయాలన్నారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ దీనిపై సమగ్రంగా చర్చించి పదోన్నతులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు చెరుకూరి శ్రీనివాసులు, రవికుమార్, రామదాసు, శ్రీరాములు, శ్రీనివాసులు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో రోడ్డు నిర్మాణాలను పూర్తిచేయించండి

● రూ.30కోట్లు అవసరం ● సీఎంకు ఎమ్మెల్సీ వినతి


సీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

వేంపల్లె, ఆగస్టు 13: వేంపల్లె పట్టణంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్లు, డ్రైనే జీ నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. నిత్యం వేలాది మంది ప్రజలు, వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, పనులు నిలిచిపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. విజయవాడలో ఉన్న సీఎంను మంగళవారం ఎమ్మె ల్సీ రామగోపాల్ రెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. వైసీపీ ప్రభుత్వం హ యాంలో కడపరోడ్డు నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు, గండి రోడ్డులో రహదారులు, మురుగుకాల్వల నిర్మాణం కోసం రూ.30 కోట్లతో పనులు మంజూరయ్యాయని, కాం ట్రాక్టర్ రూ.10కోట్ల మేర పనులు చేసి నిలిపివేశారని ఆ వినతిపత్రంలో తెలియజేశారు. ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉందని, ఈ పనులను త్వరగా ప్రారంభించి పూర్తిచేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారని వివరించారు. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తిచేసేందుకు రోడ్లు భవనాల శాఖ అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వాలని సీఎంను కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

వేంపల్లె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

వేంపల్లె, ఆగస్టు 13: ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వేంపల్లె పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన సీఐ సురేష్‌రెడ్డి, సిబ్బందితో మాట్లాడారు. రికార్డులు పరిశీలించారు. శాంతిభద్రతలను పర్యవేక్షించాలని పోలీసులకు సూచించారు.

ఐక్యు ఏసీ బృందానికి వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రశంసలు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 13 : వైవీయూ ఇంటర్నల్ క్వాలిటీ అసెస్‌మెంటు సెల్ (ఐక్యుఏసీ) బృందానికి వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి అభినందించారు. భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ 2024లో వైవీయూకు మంచి ర్యాంకు సాధించారు. ఐక్యు ఏసీ సంచాలకులు డాక్టర్ సుబ్రమణ్యశర్మ కమిటీ ప్రతినిధులు సుభాష్‌చంద్ర అభినందించారు.

మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రేపు స్వాతంత్య్ర వేడుకలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 13: మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ప్రొద్దుటూరు డివిజన్ మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్.వీరారెడ్డి తెలిపారు. 15వ తేదీ ఉదయం 7 గంటలకు గాంధీరోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించి ర్యాలీగా బయల్దేరి కోర్టు వద్ద ఉన్న నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్నామన్నారు. అనంతరం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సైనికులు, మాజీ సైనికులు, వీర నారీమణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సెంచురీ పరిశ్రమలో స్థానిక యువతకు ప్రాధాన్యమివ్వాలి

బద్వేలు, ఆగస్టు13: గోపవరం మండలంలో ఏర్పాటు చేసిన సెంచురీ ప్లైవుడ్ పరిశ్రమలో స్థానిక యువతకు అవకాశం కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బద్వేలు పట్టణంలోని సుందరయ్య భవనంలో ఆ సంఘం పట్టణ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సెంచురీ పరిశ్రమలో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలన్నారు. స్థానిక యువతకు యాజమాన్యం సహకరించాలని లేనిపక్షంలో యువతతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

కంటి, నులిపురుగుల వ్యాధుల నివారణపై అవగాహన సదస్సు

బి.కోడూరు, ఆగస్టు 13 : ఈ నెల 20వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఐత్రంపేట హైస్కూలులో విద్యార్థులకు వైద్యాధికారి ఉదయకిరణ్ అవగాహన సదస్సు కల్పించారు. అలాగే పాఠశాలలో చదువుతున్న 130 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి తొమ్మిదిమందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించామని వీరందరికీ 15 రోజుల్లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా ఉచిత కంటి అద్దాలు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యాధికారి హుసేనయ్య, ప్రధానోపాధ్యాయుడు విజయబాబు, సూపర్‌వైజరు జాన్‌విలియం, హెల్త్ అసిస్టెంటు రామతీర్థం, పీహెచ్‌వో ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలపై ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



డయాలసిస్ రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, ఆగస్టు 13 : డయాలసిస్ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మంగళవారం జిల్లా ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రోగులతో మాట్లాడిసెంటర్‌లో అందుతున్న సేవలను గురించి తెలుసుకున్నారు. ఇక్కడ డయాలసిస్‌లో ఒక మిషన్ పనిచేయడంలేదని అందువల్ల ఒక బెడ్ ఖాళీ వుందని గుర్తించారు. వారానికి ఒక రోజు నెఫ్రాల జిస్టు పర్యవేక్షిస్తాడని తెలిపారు. అనంతరం ఎక్స్‌రే, ఎంఆర్‌ఐ స్కానింగ్ సెంటర్లను పరిశీలించారు.లంచాలు అడిగితే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

సీఎంను కలిసిన సర్పంచ్ కొనిరెడ్డి



ప్రొద్దుటూరు, ఆగస్టు 13 : పంచాయతీల్లోని సమస్యలు, నిధుల కొరతపై ముఖ్యమంత్రి చంద్రబాబును కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కలిశారు. మంగళవారం విజయవాడలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో చంద్రబాబును శివచంద్రారెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ వెంట వార్డు మెంబర్ హర్షవర్ధన్‌రెడ్డి, జింకా మూర్తి తదితరులు పాల్గొన్నారు. కాగా మంత్రి సత్యకుమార్‌ను కూడా కలిసినట్లు కొనిరెడ్డి పేర్కొన్నారు.

గోకులం షెడ్లకు దరఖాస్తు చేసుకోండి

అట్లూరు,ఆగస్టు 13 : పశువులు, గొర్రెలు, కోళ్లకు షెడ్లు మంజూరైనట్లు అట్లూరు పశువైద్యాధికారి శిరీషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువులకు 90 శాతం సబ్సిడీ రైతు వాటా 10 శాతం గొర్రెలకు కోళ్లకు 70శాతం సబ్సిడీ రైతు వాటా 30 శాతంతో రాష్ట్ర ప్రభుత్వం గోకులం చెట్లకు వెసులుబాటు కల్పించిందని ఆమె తెలిపారు. దరఖాస్తుదారులు సచివాలయంలోని అనిమల్ అసిస్టెంట్‌కు తమ ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు, బ్యాంకు అకౌంటు పుస్తకం, స్థలం, వివరాలు డాక్యుమెంటు అందజేయాలని తెలిపారు.

చెత్త సేకరణ ఎలా..?

● పాడైపోయిన డస్ట్‌బిన్లు ● దెబ్బతిన్న తోపుడు బండ్లు
● సేకరణకు ఇబ్బందులు ● పట్టించుకోని మున్సిపల్ శానిటరీ అధికారులు

ప్రొద్దుటూరు, ఆగస్టు 13 : చెత్త సేకరణ పనులకు అవసరమైన వస్తువులను అందించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా ఇంటింటి చెత్త సేకరణ పనులకు వినియోగించే తోపుడు బండ్లలో డస్ట్‌బిన్లు పాడైపోయాయి.దీంతో కార్మికులు పగిలిపోయిన డస్ట్‌బిన్లకు అట్టలు అడ్డంపెట్టుకుని చెత్తను సేకరిస్తున్నారు. డస్టబిన్‌లతో పాటు తోపుడు బండ్లకు వీల్స్ చెడిపోయినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తామే వెల్డింగులు చేయించుకుని పని చేస్తున్నామంటున్నారు. చెత్త సేకరణలో ఇతర వస్తువులు కూడా కార్మికులకు సకాలంలో అందివకపోవడంతో చెత్త సేకరణ పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.

నాలుగు డివిజన్లలో ఇదే దుస్థితి..: మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు డివిజన్లలో తోపుడు బండ్లు సరిగ్గాలేక వాటికి మరమ్మతులు చేయక చెత్త సేకరణకు ఆటంకాలు ఏర్పడుతున్నాట్లు కార్మికులు వాపోతున్నారు. చీపుర్లు తెచ్చి రెండు నెలలైనా ఇంకా కార్మికులకు అందజేయలేదన్నారు.

ఇంటింటి చెత్త సేకరణకు ఆటంకాలు..: ప్రొద్దుటూరులోని నాలుగు శానిటరీ డివిజన్‌లలో గతంతో మొత్తం 38 ఆటోలు ఇంటింటి చెత్త సేకరణకు తిరిగేవి. అందులో చాలా ఆటోలు పాడైపోయి మరమ్మతులకు నోచుకోక కేవలం 15 ఆటోలు మాత్రమే తిరుగుతున్నాయి.దీంతో తోపుడు బండ్లతో ఇంటింటి చెత్త సేకరణకు బండ్లు పాడైపోయాయి.డస్ట్‌బిన్లు కూడా తగినన్ని లేవు. వున్నవి పగిలిపోయి పాడైపోయిన వాటితో పనులు చేయలేక ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు.



నిలిచిపోయిన చెత్తసేకరణ ఆటోలు

డస్ట్‌బిన్లు స్టాక్ వున్నాయి : గోవిందరెడ్డి శానిటరీ సూపర్‌వైజర్

డస్ట్‌బిన్లు 15 వరకు స్టాక్ వున్నాయి. ఏ డివిజన్‌లో డస్ట్‌బిన్లు అవసరమైతే ఆ ఇన్‌స్పెక్టర్ రిపోర్టు చేస్తే కొత్తవి అందజేస్తాం. తోపుడు బండ్లుకూడా చెడి పోయివుంటే మరమ్మతులు కూడా చేయిస్తాం.



పాడైపోయిన డస్ట్‌బిన్లు

కష్టపడి కాకుండా ఇష్టపడి చదవండి

ఖాజీపేట, ఆగస్టు 13: విద్యార్థినులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని మైదుకూరు ఇన్‌ఛార్జి జడ్జి ఆర్.హారిక అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కస్తూరిబాగాంధీ పాఠశాలలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, బాత్‌రూమ్, వాష్‌రూములను పరిశీలించి విద్యార్థులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భార్గవి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాల వెంకటయ్య, లాయర్లు నారాయణరెడ్డి, శ్రీనివాసులు, నాగిరెడ్డి, శివరామకృష్ణ, సిబ్బంది,ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

చాపాడు..: చాపాడులోని కస్తూరిబాగాంధీ గురుకుల బాలికల పాఠశాలను మైదుకూరు జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి హారిక మంగళవారం తనిఖీ చేశారు. ఆ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ నాగలక్షుమ్మను అడిగి మెనూ వివరాలు తెలుసుకున్నారు. బాలికల కోసం తయారు చేసిన వంటలను జడ్జి పరిశీలించారు. బాలికల చదువు, శుభ్రత, రాత్రిపూట నిద్రించేందుకు వసతి వంటివాటిని గురించి జడ్జి ఎస్‌వోను అడిగి వివరాలు తెలుసుకున్నారు.



చాపాడు... ఎస్‌వోతో మాట్లాడుతున్న జడ్జి హారిక

బద్వేలు రూరల్..: గ్రామీణ ప్రాంత ప్రజలు ఒకరినొకరు గౌరవించుకుంటూ ప్రేమాభిమానాలతో జీవిస్తూ తమ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తయారు చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వైజె పద్మశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి పేర్కొన్నారు. మంగళవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నందిపల్లె గ్రామంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది జీవీఎస్ఆర్ క్రిష్ణ, సూర్యనారాయణరెడ్డి, నూతి శ్రీనివాసులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆఫీసు ప్రారంభం

బి.కోడూరు, ఆగస్టు 13 : ఆంధ్రప్రదేశ్ కన్జూమర్ అండ్ జస్టిస్ హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆఫీసును మంగళవారం బి.కోడూరులో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దారు, ఏపీజీబీ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసరు, హెల్త్ డిపార్ట్‌మెంటు, పోలీసు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరిస్తామని వారు తెలిపారు. రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ చందు, రాజు, తిరుపాల్, చిన్నయ్య, నారాయణ, ఓబయ్య, నరసింహ, బాబు పాల్గొన్నారు.

19న మున్సిపల్ కార్యాలయాల ఎదుట ఆందోళన

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 13 : ప్రజారోగ్యంపై పన్నులను వ్యతిరేకిస్తూ ఈనెల 19వ తేదీ ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నామని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి చంద్ర పిలుపు నిచ్చారు. మంగళవారం సాయంత్రం సీపీఐ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోగాల సీజన్లో ముందస్తు జాగ్రత్తలు లేకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకించాలని ఈ మేరకు 19న జిల్లా వ్యాప్తంగాఅన్ని మున్సిపల్ మరియు కార్పొరేషన్,నగర పంచాయతీ కార్యాలయాల్లో సీపీఐ శ్రేణులు ఆందోళన చేపట్టాలని పిలుపు ఇచ్చారు. సమావేశంలో రామయ్య, వెంకట్, శివ, సుబ్బరాయుడు, చంద్రశేఖర్, శివారెడ్డి,ఏఐఎస్ఎఫ్ నాయకులు పీటర్, బషీర్ పాల్గొన్నారు.

కోర్టు బిల్డింగులు పూర్తి చేయాలి

ప్రొద్దుటూరు ,ఆగస్టు 13 : ఏడు సంవత్సరాలుగా పూర్తి కాని కోర్టు బిల్డింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని ప్రజాపక్షం కన్వీనర్ న్యాయవాది పుత్తా లక్ష్మీరెడ్డి డిమాండ్‌చేశారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయం వద్ద ప్రజాపక్షం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ కోర్టుకు వచ్చే కక్షిదారులకు లిఫ్ట్ సౌకర్యంలేక పై అంతస్తులకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అసంపూర్తిగా వున్న కోర్టు బిల్డింగ్‌ను పూర్తి చేయాలని కోరారు.అనంతరం డీఈ లక్ష్మీనరసింహులకు వినతిపత్రం అందజేశారు.

రైతులు ఈ-పంట నమోదు తప్పక చేయించుకోవాలి

కలసపాడు, ఆగస్టు 13 : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ-పంట నమోదు తప్పకుండా చేయించుకోవాలని ఏవో ఎస్.జాకీర్ షరీఫ్ అన్నారు. మంగళవారం రాజుపాలెం రైతు సేవా కేంద్రంలో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు తమ ఆధార్ జిరాక్స్ భూమి పాస్ పుస్తకం జిరాక్స్ మొబైల్ నెంబరు వివరాలతో తమ రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులకు అందించి నమోదు చేయించుకోవాలన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

మైలవరం, ఆగస్టు 13 : మండల పరిధిలోని వేపరాల గ్రామ సమీపంలో పెన్నానది నుంచి మంగళవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు మైలవరం ఎస్ఐ రెడ్డి సురేష్ తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఆయన హెచ్చరించారు.

విద్యా సామగ్రి పంపిణీ



ఎర్రగుంట్ల, ఆగస్టు 13: స్థానిక ఎంపీపీ మెయిన్ స్కూల్‌లో ఎర్రగుంట్ల రూరల్ డెవలప్‌మెంట్ ఉమెన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.10వేల విలువ చేసే విద్యా సామగ్రిని మంగళవారం హెచ్ఎం సుబ్బిరెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు సహాయం చేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా సొసైటీ ఆర్గనైజర్లు లీలావతమ్మ, హన్నా సుశీల, జాన్ తదితరులను అభినందించారు. ఈకార్యక్రమంలో సామాజిక కార్యకర్త, టీడీపీ టౌన్ అధ్యక్షుడు ఎస్.సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండాపురంలో రేపు రక్తదాన శిబిరం

కొండాపురం, ఆగస్టు 13: పంద్రాగస్టును పురస్కరించుకొని ఆర్మీ మాజీ ఉద్యోగి పీర్ల హాజీవలి ఆధ్వర్యంలో గురువారం కొండాపురంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. స్థానిక మసీదు దగ్గరలో రెడ్‌క్రాస్ సొసైటీ(అనంతపురం) వారి సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 10 నుంచి 4 గంటల వరకు రక్తదాన శిబిరం ఉంటుందన్నారు. శిబిరంలో పాల్గొనదలచిన వారు 7989298521 ఫోన్ నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

మట్టి వినాయకుడిని పూజించాలి

జమ్మలమడుగు, ఆగస్టు 13: జమ్మలమడుగు పట్టణంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి వారి ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రజలకు మట్టితో చేసిన వినాయకుడిని మాత్రమే పూజించాలని కళాజాతవారు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. కళాజాత వారు పాటల రూపంలో ప్రజలకు చక్కగా వివరించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాసులు, ఏఈ అనిల్‌కుమార్‌రెడ్డి, సభ్యులు రవి, వెంకటేష్, కళాజాత బృందం, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రుసుం చెల్లించాలని చెప్పడం దారుణం

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 13 : ప్రొద్దుటూరులో ఎక్కడ కూరగాయలు, పండ్లు అమ్మినా రుసుం చెల్లించాలని చెప్పడం దారుణమని రాయలసీమ సంరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన మంగళవారం పత్రికా ప్రకటనలో విమర్శించారు. కూరగాయల మార్కెట్‌కు సంబంధం లేకుండా ఎక్కడ వాహనం నిలిపి ఉన్న డబ్బులు వసూలు చేసుకోవచ్చని చెప్పడం దుర్మార్గమన్నారు. మార్కెట్ వాహనాల వల్ల రుసుం చెల్లించాలంటూ వసూలు చేసే వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. మార్కెట్‌కు దూరంగా రోడ్డుమీద అమ్ముకుంటున్న చిరు వ్యాపారులను వేధించడం దారుణమన్నారు.

డ్రైనేజీలో పూడికతీత

ఎర్రగుంట్ల, ఆగస్టు 13: ఎర్రగుంట్ల డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికతీత ను కమిషనర్ రామక్రిష్ణయ్య మంగళవారం చేపట్టారు. స్థానిక దొండపాడు రస్తాలో ఈకార్యక్రమాన్ని చేపట్టారు. అన్ని డ్రైనేజీల్లో పూడిక తీత కార్యక్రమాన్ని చేపడతామని అధికారులు వెల్లడించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ పెన్నారషీద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

పోరుమామిళ్ల, ఆగస్టు 13 : అక్కల్‌రెడ్డిపల్లె కృపానగర్ గ్రామాల పేదలకు ప్రభుత్వభూములు పంపిణీ చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి అన్వేష్ కోరారు. మంగళవారం ఆయన వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరయ్య, కేవీపీఎస్ నాయకుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

రేపు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణ



జమ్మలమడుగు, ఆగస్టు 13: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ఆర్టీసీ బస్టాండు ఎదురుగా, అలాగే పాత బస్టాండు సమీపాన ఈనెల 15వ తేదీ రెడ్డిసేవా సంఘం ఆధ్వర్యంలో విగ్రహాల ఆవిష్కరణ జరుగనుంది. అందులో భాగంగా జమ్మలమడుగులోని యోగివేమారెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాలను ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా ప్రారంభకులు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, ఇతర గౌరవ, ముఖ్య అతిథులు హాజరవుతున్నట్లు రెడ్డి సేవా సంఘం సభ్యులు తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

బద్వేలు రూరల్ , ఆగస్టు 13 : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో తిరంగ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లాఅధ్యక్షుడు వంగల శశిభూషణరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బాలక్రిష్ణయాదవ్, బీజేవైఎం జిల్లా ప్రధాన జిల్లా కార్యదర్శి బొమ్మన విజయ్ హాజరయ్యారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణం నుంచి విద్యార్థులతో కలిసి జాతీయ జెండా చేతబట్టి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యవర్గసభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, బొజ్జ రోశన్న, అసెంబ్లీ కన్వీనరు భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కుప్పాల నరసింహులు, పవన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



బద్వేలులో జాతీయ జెండాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

యువత దేశసేవకు పాటుపడాలి

మైదుకూరు రూరల్ ఆగస్టు 13 : యువత ప్రతి ఒక్కరూ దేశసేవకు పాటుపడాలని బీజేపీ మైదుకూరు నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు అన్నారు. స్థానిక పట్టణంలోని హర్ ఘర్ తిరంగా స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని మంగళవారం జాతీయ జెండాలను చేతపట్టి భారీ ర్యాలీని చేపట్టారు.అంబేడ్కర్ విగ్రహం,రాయల్ సర్కిల్,పొట్టిశ్రీరాముల విగ్రహాల వద్దకు ర్యాలీగా వెళ్లి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోబీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో పందుల పట్టివేత

● అడ్డగించిన పందుల పెంపకం దారులు ● పోలీసుల జోక్యంతో సర్దుబాటు

ప్రొద్దుటూరు, ఆగస్టు 13 : ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో వీధి పందుల ఏరివేత కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగాటీంల సహాయంతో పందుల పట్టివేతను చేపట్టారు. మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా ఆధ్వర్యంలో పులివెందుల నుంచి వచ్చిన పందుల పట్టివేత టీం పట్టణంలో వలలు వేసి పందులను పట్టుకున్నారు. ముఖ్యంగా మున్సిపల్ గాంధీ పార్కు, వైఎంఆర్‌కాలనీ, మౌలానా ఆజాద్ వీధి, శాంతకుమారివీధి,40 పందులకు పైగా పట్టుకున్నారు. వీటిని పట్టేక్రమంలో వైఎంఆర్‌కాలనీ దగ్గర పందుల పెంపకం దారులు అడ్డగించారు. తమ పందులు పట్టుకుంటే తమ జీవనాధారం పోతుందని గొడవకు దిగారు దీంతో త్రీటౌన్ పోలీసులకు శానిటరీ అధికారులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వచ్చి వారి విధులను అడ్డుకుంటే కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ రోజుతో పందుల పట్టివేత నిలిపివేస్తున్నారు. వాటిని రోడ్ల మీదికి వదిలితే పట్టుకుంటామని అధికారులు హెచ్చరించారు.

నెలాఖరులోగా పందులను ఊరి వెలుపలకు తరలించాలి

యజమానులకు సీఐ హెచ్చరిక

ఎర్రగుంట్ల, ఆగస్టు 13: నగరపంచాయతీలో స్వైరవిహారం చేస్తున్న పందులను ఈనెలాఖరులోగా ఊరికి 5 కిలోమీటర్ల దూరంలో పెంచుకోవాలని సీఐ నరేష్‌బాబు హెచ్చరించారు. మంగళవారం కమిషనర్ రామక్రిష్ణయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్‌తో కలిసి పందుల యజమానులతో మాట్లాడారు. పందులకు వెంటనే తరలించాలని ఆదేశించారు. అయితే కొంతసమయం కావాలని పందుల యజమానులు కోరడంతో ఆగస్టు నెలాఖరు కల్లా ఊరికి 5కిలోమీటర్ల దూరంలో పెంచుకోవాలని లేదంటే వాటిని తామే తరలించి పెంపకం దారులపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.



ప్రొద్దుటూరు...గాంధీ పార్కువద్ద పందులు పడుతున్న దృశ్యం